అందాల 'రాశీ'.. ఎక్కెల్లిలో మెరిసి..



జహీరాబాద్ పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎస్వీ వస్త్ర దుకాణాన్ని ప్రముఖ సినీ నటి రాశీఖన్నా గురువారం ప్రారంభించారు. ప్రధాన ద్వారం వద్ద రిబ్బన్ కట్ చేసి దుకాణంలోని వివిధ విభాగాల్లో కలియదిరిగి సందడి చేశారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, సెట్విన్ ఛైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఎ.చంద్రశేఖర్, దుకాణ యజమానులు అల్లాడి వీరేశం, అల్లాడి నర్సింహులు, అనిల్ జాజు.. వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. **– న్యూస్‌టుడే, జహీరాబాద్**

5 వరకు ధ్రువపత్రాల పరిశీలనకు అవకాశం: కలెక్టర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలోని డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఈనెల 5 వరకు అవకాశం ఉందన్నారు. అనంతరం పరీక్షల విభాగం సంచాలకుడు కృష్ణారావు పరిశీలించారు.



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

అందరికీ కుటుంబ డిజిటల్ కార్డులు..

కంది: ప్రతి కుటుంబం ఆరోగ్య వివరాలను జాగ్రత్తగా సేకరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. మండలంలోని తోపుగొండలో గురువారం డిజిటల్ సర్వేను పరిశీలించారు. ప్రత్యేక నంబరుతో స్మార్టు కార్డులివ్వనునట్లు తెలిపారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో పి.శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం రూరల్: ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. తెల్లాపూర్ పరిధి ఎంఐజీ కాలనీలో ఆమె పర్యటించారు.

ఈనాడు సంగారెడ్డి

శుక్రవారం అక్టోబరు 4, 2024

బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

గుమ్మడిదల: కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఆలయ కమిటీ ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈనెల 6న కల్యాణోత్సవానికి హాజరు కావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి కోరారు.

బియ్యం కుతకుత.. నూనె సలసల

పండుగల వేళ ధరల దడ

సిద్దిపేటకు చెందిన సురేశ్ చిరుద్యోగి. చిన్నపాటి వేతనంతో ఆరుగురి కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు. ప్రతి నెలా ప్రణాళికతో వెచ్చిస్తుంటారు. ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, ఇతర ఖర్చులకు పక్కాగా ఖర్చుపెడుతుంటారు. కొన్నాళ్లుగా పెరిగిన ధరలతో లోటు బడ్జెట్ ఎదుర్కొంటున్నారు. నిత్యావసర ధరలు అమాంతం పెరగడంతో ప్రతి నెలా రూ.3 వేలు ఖర్చు చేయగా.. కొన్నాళ్లుగా ఆ పద్దు రూ.4,500కు పెరిగింది.

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, జహీరాబాద్

నూనె ధర చేజారుతోంది.. బియ్యం ఉడకనంటోంది.. పప్పు బద్దకిస్తోంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న నిత్యావసర ధరలతో పేద, మధ్య తరగతి కుటుంబాలు బేజారవుతున్నాయి. ప్రతి నెలా నిర్వహణ ఖర్చులు భారంగా మారుతున్నాయి. ఇంటి సారథి.. కుటుంబాన్ని వెళ్లదీసేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న ధరలతో షాక్‌కు గురవుతున్నారు. పెద్ద పండగలైన దసరా, దీపావళి వచ్చేశాయి. పండగల వేళ జనమంతా ఇబ్బందులకు గురవుతున్నారు.

దడ పుట్టిస్తోంది..



పెరుగుతున్న బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. క్వింటాకు రూ.500 నుంచి రూ.వేయి వరకు పెరిగింది. నెల వ్యవధిలో పెరుగుదల ప్రభావం చూపింది. ఐదుగురు ఉండే ఇంట్లో నెలకు కనీసం 40 నుంచి 50 కిలోల బియ్యం వాడుతారు. పాత సన్నబియ్యం ధరలు భారీగా పెరగడంతో దొడ్డురకం వైపు మళ్లుతున్నారు.

సన్నబియ్యం ధర (రూ.లలో..)	
గతేడాది	5500
ప్రస్తుతం	7000

కొనలేక..

ఎండు కొబ్బరి వంటకాల్లో రుచిని పెంచుతుంది. చిక్కదనాన్ని, పోషకాలను అందిస్తుంది. పది రోజుల్లో ధర అమాంతం పెరిగింది. ఆరు నెలల్లో పప్పుల ధరలు పెరిగాయి. మరోవైపు కిలో నువ్వులు రూ.180కు చేరింది. చక్కెర రూ.41, గోధుమపిండి రూ.40, రవ్వ- రూ.42 పలుకుతోంది. గతంతో పోలిస్తే రూ.5 పెరిగినట్లు స్పష్టమవుతోంది. కూరగాయల ధరలూ భగ్గుమంటున్నాయి.

నిత్యావసరం	గతేడాది	ప్రస్తుతం (రూ.లలో..)
ఎండుకొబ్బరి	140	220
కంది పప్పు	140	180
పెసర పప్పు	110	130
శనగ పప్పు	80	120
చక్కెర	38	42
చింతపండు	100	140



20 శాతం పెరిగి..





వంటనూనె ధరలకు రెక్కలొచ్చాయి. 15 రోజుల్లోనే 20 శాతానికి పైగా పెరిగింది. ఈ మార్పు స్పష్టమైంది. సన్ ఫ్లవర్, రైస్ బ్రాన్, పల్లీ నూనె కొనలేని పరిస్థితి. ప్రతి నెలా సగటున 5 కిలోలు వినియోగించగా.. ఇప్పుడు 3 కిలోలకు తగ్గించేందుకు చూస్తున్నామని గజ్వేల్‌కు చెందిన మారుతి చెప్పుకొచ్చారు. పండుగ సీజన్‌లో పిండి వంటలకు నూనె వినియోగం తప్పనిసరి కావడంతో ఏం చేయాలన్న మీమాంసలో పడిపోతున్నారు.

నూనె ధర (రూ.లలో..)	
గతేడాది	110
ప్రస్తుతం	135

నిత్యావసర ధరలు తగ్గాలంటే ఏం చేయాలి?

జిల్లాలో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన 100 మందితో 'న్యూస్‌టుడే' నిర్వహించిన సర్వేలో ఇలా స్పందించారు.





ప్రభుత్వం నుంచి మీరు కోరుకునేది?

అదుపులోకి తేవాలి: స్వాతి, గృహిణి, జహీరాబాద్



కూరగాయల ధరలు అమాంతం రెండు, మూడింతలు పెరిగాయి. ముఖ్యంగా నిత్యం వాడే టమాట, మిర్చి, ఉల్లిగడ్డతోపాటు ఇతర కూరగాయల ధరలు పెరగడంతో కుటుంబ ఖర్చులు బాగా ఎక్కువయ్యాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

సరిపడా రావడం లేదు..: అనిత, గృహిణి, సంగారెడ్డి



మార్కెట్లో కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. రూ.1,000 తీసుకొని సంతకు వెళితే వారానికి సరిపడా రావడం లేదు. నిత్యం కూరగాయలు తింటే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతుండగా. . ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి.

భూసేకరణపై హరిత ధర్మాసనంలో కేసు వేస్తాం



దప్పూర్‌లో రైతుల పొలాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌రావు.. చిత్రంలో మాణిక్‌రావు, శివకుమార్, దేవీప్రసాద్ తదితరులు

జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్- న్యూస్‌టుడే: మూడు పంటలు పండే సాగు భూములు కోల్పోతామని అన్నదాతలు అధైర్యపడొద్దని, భారాస అండగా ఉండి ఫార్మాసిటీ భూసేకరణపై హరిత ధర్మాసనంలో కేసు వేస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో ఫార్మాసిటీ భూసేకరణను వ్యతిరేకిస్తూ మూడు గ్రామాల రైతులు గురువారం చేపట్టిన ఆందోళనలో పాల్గొని రచ్చబండ నిర్వహించారు. హైదరాబాద్ శివారులోని ఫార్మాసిటీకి అన్ని అనుమతులున్నా.. అక్కడ కాదని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల్లో 2 వేల ఎకరాల భూములు సేకరించడం ఏంటని ప్రశ్నించారు. సారవంతమైన భూములను బలవంతంగా సేకరిస్తామంటే చూస్తూ ఊరుకోబోమని, రైతుల పక్షాన హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. భూసేకరణకు పొక్లెయిన్‌లు వస్తే ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి అడ్డుగా నిలబడతానని భరోసా ఇచ్చారు. అంతకుముందు డప్పూర్, మల్గి శివార్లలోని పంట పొలాలను ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతాప్రభాకర్, డీసీఎంఎస్ ఛైర్మన్ శివకుమార్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవీప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో భారాస మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచి రవికుమార్, నాయకులు భాస్కర్, నర్సింహారెడ్డి ఉన్నారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే చేపట్టాలి



మంగంపేటలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ప్రత్యేకాధికారిణి హరిచందన

జిన్నారం, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని మంగంపేటను ఎంపిక చేయడంతో గురువారం నిర్వహించిన హౌస్‌హోల్డ్ సర్వేను జిల్లా ప్రత్యేకాధికారిణి హరిచందన పరిశీలించారు. మూడు బృందాలుగా ఏర్పాటై కార్డుల జారీ కోసం వివరాలు సేకరిస్తున్న తీరును తహసీల్దార్ భిక్షపతి ఆమెకు వివరించారు. ఇంట్లో మొత్తం సభ్యులు, కార్డు యజమానిగా మహిళ ఉండేలా తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. గ్రామంలో 179 కుటుంబాలుండగా మొదటి రోజు 134 పూర్తయ్యాయి. ఎంపీడీవో అరుణారెడ్డి, ఎంపీవో రాజ్‌కుమార్, తదితర అధికారులకు హరిచందన పలు సూచనలు చేశారు. లోపాలు లేకుండా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదేశించారు. పటాన్‌చెరు నియోజకవర్గ నోడల్ అధికారి దేవుజా తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో ఎదిగి.. ఐక్యతతో ఒదిగి

విద్యార్థి దశలో కీలకంగా ఎన్‌సీసీ

సద్వినియోగంతో భవిత ఖాయం

న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి టౌన్, మెదక్ టౌన్, వికారాబాద్ టౌన్

సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్దకు చెందిన జి.సతీశ్ కుమార్ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతేడాది డిగ్రీ పూర్తిచేశారు. 2023లో తృతీయ సంవత్సరం చదువుతున్నప్పుడే పోలీసు కానిస్టేబుల్ (సివిల్) పరీక్ష రాసి లక్ష్యాన్ని సాధించారు. 9వ తరగతిలో ఎన్‌సీసీలో చేరడం కలిసొచ్చింది. దీని కోటా కింద కొలువుకు దరఖాస్తు చేసుకోవడం.. మార్కులు కలిసొచ్చాయి. ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు.

ఎన్‌సీసీ.. క్రమశిక్షణకు మారు పేరు. విద్యార్థి దశలో జాతీయ భావాలు పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. సమగ్రతకు బాట వేసేలా.. ఐక్యత నినాదాన్ని వినిపిస్తుంది. సేవ వైపు మళ్లిస్తుంది. గొప్ప వ్యక్తిత్వంతో ఉన్నతంగా ఎదిగేందుకు బాటలు వేస్తుంది. ఈ దిశగా విద్యా సంస్థల్లో ప్రేరణ కల్పించడంలో నేషనల్ కేడెట్ కార్ప్స్ కీలకపాత్ర పోషిస్తోంది. డిగ్రీ దశలో ఈ బృందాలు.. ప్రభావవంతంగా, క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయి.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 17 డిగ్రీ కళాశాలలు, పాఠశాలల్లో ఎన్‌సీసీ అమలవుతోంది. 1546 మంది విద్యార్థులు కేడెట్లుగా కొనసాగుతున్నారు. సిద్దిపేట స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు ఇప్పటి వరకు 21 మంది అగ్నిపథ్‌లో చేరారు. ఏటా పోలీసు లేదా ఆర్మీలో 10 మంది కొలువులు సాధిస్తున్నారు. మెదక్, సంగారెడ్డిలోనూ కేడెట్లు ఉద్యోగాలు సాధిస్తున్నారు.

జనరల్ ఎలక్టివ్ పేపర్..

గతంలో ఎన్‌సీసీ సహ పాఠ్య కార్యక్రమంగా కొనసాగించారు. గతేడాది నుంచి దీన్ని కోర్సులో ఒక పేపర్‌గా గుర్తించారు. గత విద్యాసంవత్సరంలో ఎన్‌సీసీని ఓ పేపర్‌గా గుర్తించాలని యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) అన్ని వర్సిటీలకు సూచించింది. జనరల్ ఎలక్టివ్ (జీఈ) పేపర్‌గా డిగ్రీ తృతీయ సంవత్సరంలో విద్యార్థులు ఎంచుకోవచ్చు. ఇతర పేపర్ల మాదిరిగానే క్రెడిట్లు (మార్కులు) పొందే వీలుంది. ఉన్నత విద్యలో చేరేందుకు 'సి' సర్టిఫికెట్‌ను ఉపయోగించుకుంటున్నారు.



ఎన్‌సీసీ విద్యార్థులు

శిక్షణ.. బాధ్యతలు

- విద్యాసంవత్సరంలో మొత్తంగా కేడెట్లకు 40 వరకు తరగతులు నిర్వహిస్తారు.
- కవాతు, మ్యాప్ రీడింగ్, సాయుధ శిక్షణ, సామాజిక సేవలో తప్పనిసరిగా భాగస్వాములయ్యేలా చూస్తారు.
- విపత్తులు, ఇతర సందర్భాల్లో సేవ చేయాల్సి ఉంటుంది.
- వారంలో రెండు గంటలు తరగతులు, డ్రిల్ సాధన చేయాలి.
- ఏడాదిలో ఒకసారి ప్రాక్టికల్, థియరీ పరీక్షలు ఉంటాయి.
- పాఠశాల స్థాయిలో ఏ, డిగ్రీ స్థాయిలో బీ, సీ ధ్రువ పత్రాల పరీక్షలు ఉంటాయి. ప్రతి ఏటా ఒక శిబిరానికి హాజరు కావాలి.


జిల్లాల వారీగా ఇలా..

కేడెట్లు	డిగ్రీ కళాశాలలు	
600	7	సంగారెడ్డి
700	4	సిద్దిపేట
160	1	మెదక్
86	2	వికారాబాద్



సాయుధ శిక్షణలో కేడెట్లు

ఉన్నత పౌరులుగా..:



ఎన్‌సీసీలో చేరిక ఎంతో ఉపయోగకరం. మానసికంగా, శారీరకంగా దృఢంగా మారుతారు. సమస్యలు ఎదురైనా తట్టుకుని నిలబడే సామర్థ్యం కలిగి ఉంటారు. ఉన్నత విద్య, ఉద్యోగంలో మంచి అవకాశాలు ఉంటాయి. అన్ని కళాశాలల్లో అందుబాటులోకి తెస్తే మేలు.

లెఫ్టినెంట్ మహేందర్‌రెడ్డి, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి, గజ్వేల్

సద్వినియోగం చేసుకోవాలి:



విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దేశభక్తి చాటేందుకు ఇదో వేదిక గుర్తుంచుకోవాలి. విద్యార్థులకు క్రమశిక్షణ కూడా అలవడుతుంది. ఉన్నత లక్ష్యాలను సులువుగా చేరుకుంటారు.

విజయ, ఎన్‌సీసీ అధికారి, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డి

ప్రయోజనాలు..

● విశ్వవిద్యాలయాల్లో కోటా కింద ఉన్నత విద్యలో ప్రవేశం పొందవచ్చు. ● వివిధ రాష్ట్రాల్లో నిర్వహించే శిబిరాల ద్వారా జాతీయ సమైక్యతా భావం పెరుగుతుంది. ● దేశ రక్షణ విభాగాల్లో చేరడం సులువు. ● సర్టిఫికెట్ ఆధారంగా పోలీసు శాఖ, ఆర్మీలో ప్రాధాన్యం ఇస్తారు. ● దిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ శిబిరంలో పాల్గొని కవాతు చేయవచ్చు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వృద్ధురాలి మృతి

రామాయంపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. రామాయంపేట ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని రాయిలాపూర్‌కు చెందిన అన్నబోయిన సావిత్రి (65) గత నెల 28న దుబ్బాకకు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. గ్రామ శివారులో కుక్కలు అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. సావిత్రిని ములుగు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కోడలు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మరో ఘటనలో యువకుడు..



నవీన్

కంది: ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై వినయ్ కుమార్ తెలిపిన వివరాలు.. కంది మండలం చిమ్నాపూర్‌కు చెందిన ఏర్పుల నవీన్(36) ఐటీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో కుక్కలు అడ్డురావడంతో కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు గాయాలు కాగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనతో ఉస్మానియాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య శిరీష సంగారెడ్డి రూరల్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

చికిత్స పొందుతూ మహిళ..



లక్ష్మి

మిరుదొడ్డి: ద్విచక్ర వాహనంపై నుంచి పడి గాయాలైన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. భూంపల్లి ఎస్సై హరీష్ తెలిపిన వివరాలు.. మిరుదొడ్డి మండలం అల్వాలకు చెందిన లక్ష్మి తనకుమారుడితో కలిసి గతనెల 25న ద్విచక్ర వాహనంపై మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంటకు బయలుదేరారు. అక్బర్‌పేట- భూంపల్లి మండలం పోతారెడ్డిపేట శివారులో బైక్ అదుపుతప్పి కింద పడగా లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పాము కాటుకు బాలుడి బలి



మణికేశ్వర్

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: పాము కాటుతో బాలుడు మృతి చెందిన ఘటన సిద్దిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన తుమ్మల శ్రీనివాస్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు మణికేశ్వర్(7) ఉన్నారు. శ్రీనివాస్ ఉపాధికి 20రోజుల కిందట గల్ఫ్ వెళ్లాడు. లక్ష్మి బీడీ కార్మికురాలిగా పని చేస్తోంది. బడికి సెలవులు కావడంతో గురువారం మణికేశ్వర్ తల్లి వెంట బీడీ కంపెనీకి వెళ్లాడు. అక్కడ ఖాళీ స్థలంలో బాలుడు అట్టపెట్టెను తీస్తుండగా, నాగుపాము కాటు వేసింది. ఈ విషయాన్ని అక్కడున్న వారు గమనించలేదు. కాలుకు ఏదో గుచ్చుకుంది అని భావించారు. ఇంటికి వెళ్లే సరికి మణికేశ్వర్ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందాడని నిర్ధారించారు. గ్రామస్థులంతా బీడీ కంపెనీ వద్దకు వెళ్లి, ఖాళీ అట్టపెట్టెలను తొలగించి చూడగా నాగుపాము కనిపించింది. పాము కాటుతోనే బాలుడు మరణించాడన్నారు. మణికేశ్వర్ ఒకటో తరగతి చదువుతున్నాడు. చిన్నారి మృతితో విషాదం అలుముకుంది.

సాంకేతికత తోడుగా విద్యుత్తు సేవలు



ఎన్‌పీడీసీఎల్ యాప్

విద్యుత్తు వినియోగదారులకు మరింత చేరువయ్యే లక్ష్యంతో టీజీ ఎన్పీడీసీఎల్ అడుగులేస్తోంది. ఇందులో భాగంగా సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వినియోగంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. వినియోగదారుడు తన అరచేతిలో ఉండే చరవాణి నుంచే పలు రకాలుగా వినియోగించుకునే అవకాశం ఉంది. నూతన సాంకేతికతను జోడించి వినియోగదారుల సౌకర్యార్థం 19 రకాల ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకు చేయాల్సిందల్లా స్మార్ట్‌ఫోన్‌లో కొత్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుంది. సంబంధిత అధికారులు దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు దీనిద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

ఏ మేర పెరిగిందో..: ఇందులో బిల్లు కాలిక్యులేటర్‌ను సైతం అందుబాటులో ఉంచారు. ఎన్ని యూనిట్లు వాడితే ఎంత బిల్లు వస్తుంది, యూనిట్లు ఎక్కువైన కొద్దీ ఛార్జీ పెరిగే తీరు తెలుసుకోవచ్చు. ఆయా ఆప్షన్లతో పాటు కొత్త కనెక్షన్ పొందడం, పేరు, లోడు మార్పు, విద్యుత్తు నిబంధనలు, టారిఫ్ వివరాలు, ఏ విభాగానికి ఎంత ఛార్జి, గృహ, గృహేతర, పరిశ్రమలు తదితర వివరాలూ చూసుకోవచ్చు. పొదుపు, సూచనలనూ పొందుపరిచారు. ప్రమాదం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగదారుల ఫీడ్ బ్యాక్ కూడా ఇచ్చే వీలుంది. టోల్ ఫ్రీ నంబరును సైతం పొందుపరిచారు.

- న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

యాప్‌లో ఇలా..

రిపోర్టు ఆన్ ఇన్సిడెంట్: ఎక్కడైనా ఏదైనా ప్రమాదం, ఘటన జరిగితే జీపీఎస్ లోకేషన్‌తో చరవాణిలో ఫొటో తీసి అధికారులకు పంపించవచ్చు. సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదు నమోదు: వినియోగదారులు తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చు. మీటరు నంబరు, సమస్య రాస్తే దాన్ని పరిష్కరిస్తారు. అది ఏ స్థాయిలో ఉందో కూడా తెలుసుకోవచ్చు. ఒకవేళ సమస్య తీరకపోతే మరో సారి ఫిర్యాదు చేయవచ్చు.

సెల్ఫ్ రీడింగ్: ప్రతి నెలా విద్యుత్తు సిబ్బంది వచ్చి మీటరు రీడింగ్ తీస్తారు. అలా కాకుండా వినియోగదారుడే నేరుగా మీటరు రీడింగ్ తీయవచ్చు. ఎంత మేర విద్యుత్తు వాడాం, ఏ మేర బిల్లు వచ్చిందో తెలుసుకోవచ్చు.

బిల్లు చెల్లింపు: యాప్ ద్వారా బిల్లు చెల్లించవచ్చు. ఆయా వివరాలు వెంటనే చూసుకునే వీలుంది. గతంలోని వివరాలూ తెలుసుకోవచ్చు.

ఆధార్ లింక్: విద్యుత్తు మీటరుకు ఆధార్‌తో పాటు చరవాణి నంబరు అనుసంధానం చేసి ఉంటే ప్రతి నెలా బిల్లు, ఇతర వివరాల సందేశాలు వస్తాయి. అధికారులు ఇప్పటికే ఆయా వివరాలు నమోదు చేశారు. అయితే చాలా మంది నమోదు చేసుకోలేదు. అలాంటి వారు యాప్‌లో వాటిని నమోదు చేసుకోవచ్చు.

విధుల్లో నిర్లక్ష్యం.. పోలీసు అధికారులపై వేటు

వికారాబాద్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా, విధులలో నిర్లక్ష్యం.. వెరసి వికారాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలపై పోలీసు శాఖ చర్యలకు ఉపక్రమించింది. వికారాబాద్ పట్టణ సీఐ నాగరాజును సస్పెండ్ చేయగా, తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్‌లను ఐజీ కార్యాలయానికి, యాలాల, పెద్దేముల్ ఎస్‌ఐలు శంకర్, గిరన్నలను ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం(అటాచ్) చేస్తూ మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. జోగిపేట సీఐగా విధులు నిర్వర్తిస్తున్న తరుణంలో వికారాబాద్ సీఐ నాగరాజు ఓ మైనర్‌పై జరిగిన అత్యాచారం కేసులో విధుల పట్ల నిర్లక్ష్యం, అవకతవకలకు పాల్పడటంతో పాటు కేసును నీరుగార్చేలా దర్యాప్తు చేశారన్న అభియోగంతో సస్పెన్షన్ వేటు వేశారు. తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్, యాలాల, పెద్దేముల్ ఎస్‌ఐలు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలం, ఇతర కారణాలతో శాఖాపరమైన చర్యల్లో భాగంగా అనుసంధానం చేశారని పోలీస్ వర్గాలు తెలిపాయి.

సంగారెడ్డిలో ఇద్దరిపై..

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన ఇద్దరు పోలీసు అధికారులపై వేటు పడింది. సంగారెడ్డి గ్రామీణ సీఐ అశోక్, ఎస్సై వినయ్‌కుమార్‌ను వీఆర్‌కు ఆటాచ్ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి, కంది మండలాల్లోని నక్క వాగు పరిధిలో కృత్రిమ ఇసుక తయారీ జోరుగా సాగుతోంది. అనుమతుల్లేకుండా తవ్వుతుండడంతో పర్యావరణం దెబ్బతినడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని నిఘా వర్గాల ద్వారా పోలీసు శాఖ సమాచారం సేకరించింది. అక్రమార్కులకు సీఐ, ఎస్సై ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడంతో చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఆన్‌లైన్ బెట్టింగ్.. వ్యాపారి..



నవీన్

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో నష్టపోయిన వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట- భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పరుశరాములు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన ఈదారి నవీన్ (27) ఎరువులను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సులువుగా ఆదాయం సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు మరలి, రూ.26 లక్షల అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. వాటిని తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపానికి గురైన పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతని మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవీన్‌కు భార్య రాధిక, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కడుపు నొప్పి భరించలేక మహిళ..

బెజ్జంకి, న్యూస్‌టుడే: కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని గుగ్గిళ్లకు చెందిన కనకవ్వ(38)కు భర్త సంపత్, ముగ్గురు కుమార్తెలు ఉండగా, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మూడేళ్ల కిందట అనారోగ్య సమస్యలతో ఆమెకు శస్త్రచికిత్స చేసి గర్భసంచిని తొలగించారు. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది గురువారం పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. 108 వాహనంలో కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

రైలుకిందపడి గుర్తు తెలియని వృద్ధుడు..

తాండూరు టౌన్: రైలుకింద పడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాండూరులో గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం రైల్వే యార్డు సమీపంలో 60 ఏళ్ల వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహంపై నలుపు, ఎరుపు, తెలుపు రంగు స్వెట్టరు ఉంది. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి శవాగారంలో భద్రపరిచారు.

అనారోగ్యంతో మహిళ..

మొయినాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన సున్నం జగ్గమ్మ(28) మూడేళ్లుగా నజీబ్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటోంది. ఆమె కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధ పడుతోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో బుధవారం గుర్తు తెలియని పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబీకులు ఉస్మానియా దవాఖానాకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

యువకుడిపై కత్తితో దాడి

బెజ్జంకి, న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ యువకుడిపై కత్తితో దాడిచేసిన పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై క్రిష్ణారెడ్డి సమాచారం ప్రకారం.. బెజ్జంకికి చెందిన సోమని ప్రవీణ్ కొద్ది నెలలుగా కోరుట్లలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన పలువురి వద్ద కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించకుండా ఆలస్యం చేస్తున్నాడని గ్రామానికి చెందిన వేల్పుల శ్రీను, వేల్పుల శ్రీకాంత్, వేల్పుల చందు, మరికొందరితో కలిసి గురువారం కారులో హైదరాబాద్ వెళ్తున్న ప్రవీణ్‌ను తోటపల్లి వద్ద అడ్డగించారు. కత్తితో దాడిచేసి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలగోకులం.. సత్ప్రవర్తనకు మార్గం



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

వికారాబాద్ జిల్లాలో వ్యాపార, వాణిజ్య పట్టణంగా పేరున్న తాండూరులో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న బాలగోకులం చిన్నారి విద్యార్థుల్లో సత్ప్రవర్తన, దేశభక్తి పెంచేందుకు దోహదపడుతోంది. తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవాన్ని చూపేలా చేస్తుంది. మూడేళ్ల కిందట కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టణ శివారులో ఒక చోట బాలగోకులాన్ని నిర్వహించారు. ప్రారంభంలో కొంతమంది పిల్లలే వచ్చారు. వారికి ఉపాధ్యాయులు ఆధ్యాత్మికం, దేశభక్తి, సమాజంలో మెలిగే తీరు, తదితర అంశాలను బోధించారు. ఇవన్నీ తల్లిదండ్రులకు నచ్చడంతో తమ పిల్లలను ఇక్కడికి పంపించే వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇక్కడ విజయవంతమైన బాలగోకులాన్ని పట్టణంలో విస్తరించాలని ఉపాధ్యాయులు నిర్ణయించారు. ఇలా ప్రస్తుతం మూడు చోట్ల ప్రతి ఆదివారం బాలగోకులం నిర్వహిస్తుండటం విశేషం.

ఆలయాలే వేదికగా..

ఆలయాలే వేదికగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. బసవేశ్వరనగర్‌లోని చెరువెంటి ఈశ్వరుడు, భవానీనగర్‌లోని రామలింగేశ్వరుడు, తులసీనగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయాల వేదికగా జరుగుతున్నాయి. ముందుగా పిల్లలతో పూజలు, హారతి ఇప్పిస్తారు. రామాయణ, మహాభారత శ్లోకాలు నేర్పిస్తారు. నీతికథలు చెబుతారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం ఎలాగో నేర్పిస్తారు. అదే సమయంలో కుల, మతాలు లేని స్నేహం గురించి వివరించడంతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు. చదువుతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. పిల్లలు భవిష్యత్తులో సత్ప్రవర్తన కలిగి ఉండటం, ఉన్నత స్థాయికి ఎదగడం, సమాజం పట్ల సదాభిప్రాయం, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించే లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని బాలగోకులం నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వరూప, శివకుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆనందం తెలిపారు.

- న్యూస్‌టుడే, తాండూరు

గజ్వేల్.. మంత్రుల రాకతో జిగేల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం, ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గురువారం రావడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. సభలో మంత్రుల ప్రసంగాలకు హాజరైన వారు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. బోనాలు, కోలాటాలతో కళాకారులు ప్రదర్శన చేపట్టారు. గజ్వేల్ పట్టణమంతా ఒక్కసారిగా ముగ్గురు మంత్రులు రావడంతో ఆద్యంతం సందడి నెలకొంది.

- న్యూస్‌టుడే, గజ్వేల్



గజ్వేల్‌లో ప్రజ్ఞాపూర్ నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీలో పార్టీ శ్రేణులు



ర్యాలీలో బోనాల ఊరేగింపు, కోలాటం, ఒగ్గు కళాకారుల ప్రదర్శన

ఉన్నతీకరించి.. ఉపయోగమేది?

● మినీ అంగన్‌వాడీల్లో జాడ లేని జీతభత్యాల పెంపు

న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట, పరిగి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య సలహాలు అందించడంతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వెయ్యి జనాభా ఉన్న ప్రాంతంలో ప్రధాన కేంద్రం, అంతకంటే తక్కువ జనాభా ఉంటే మినీ అంగన్‌వాడీలను నెలకొల్పింది. అయితే మినీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య పెరగడంతో అక్కడ అందించే సేవలు ఇబ్బందికరంగా మారాయి. ఆయాల నియామకాలు లేకపోవడంతో, అంగన్‌వాడీ టీచర్లే నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం గత జనవరిలో మినీ కేంద్రాలను ఉన్నతీకరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సమస్యలు పరిష్కారం అవుతాయని అంతా భావించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఉత్తర్వులకే పరిమితం..

రాష్ట్రవ్యాప్తంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఎనిమిది నెలల కిందట ఇచ్చిన ఉత్తర్వులు కాగితాలకే పరిమితమయ్యాయి. చాలా చోట్ల శాశ్వత భవనాలు కరవయ్యాయి. పిల్లలను ఆడించేందుకు ఆట వస్తువులు, ఇతర సామగ్రి కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాలేదు. కేవలం సరకులు ఇస్తుండగా, కేంద్రాలను నెట్టుకొస్తున్నారు.

● కేంద్రాలకు పక్కా భవనాలు లేక పాఠశాల అదనపు గదులు, సామాజిక, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మినీ కేంద్రాల్లో ఆయా పోస్టులు అవసరం. వీటి భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించినా ఇప్పటివరకు అడుగు పడలేదు. ఒక్కో మినీ కేంద్రంలో ఒక్కో టీచరు పని చేస్తుండగా ప్రతి నెలా రూ.7,800 చొప్పున వేతనం అందిస్తున్నారు. కేంద్రాల ఉన్నతీకరణ తర్వాత రెండు నెలలు టీచర్లకు పెంచిన జీతాలు రూ.13,650 చొప్పున అందజేసి, ఆ తర్వాత నిలిపివేశారు.

నాలుగు జిల్లాల్లో వివరాలు..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన	మినీ
మెదక్	1,076	191
సంగారెడ్డి	1,444	160
సిద్దిపేట	1,084	66
వికారాబాద్	757	350

విడుదల కావాల్సి ఉంది:

మినీ కేంద్రాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. రెండు నెలలు పెంచిన జీతాలను టీచర్లకు అందించాం. బడ్జెట్ కేటాయింపు లేక మళ్లీ పాత వేతనాలే జమయ్యాయి. పెంచిన వేతనాలు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

బ్రహ్మాజీ, మహిళ,శిశు సంక్షేమాధికారిణి, మెదక్

అత్యాచార నిందితుడిని శిక్షించాలి: ప్రభుత్వ విప్

చేర్యాల: కొమురవెల్లి మండలం గురువన్నపేటలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం డిమాండ్ చేశారు. కురుమ సంఘం ప్రతినిధుల బృందం గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సిద్దిపేటకు వెళ్లి సీపీ అనూరాధకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు క్యామ మల్లేశ్, నాయకులు ఉన్నారు. బాలిక ఇంటర్మీడియట్ వరకు విద్య అందించే బాధ్యత తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	112-00
రిటైల్	134-00
డ్రెస్డ్	194-00
స్కిన్‌లెస్	221-00

చింతకుంటలో పర్యటించిన శిక్షణ కలెక్టర్



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ మనోజ్

జోగిపేట న్యూస్‌టుడే: అందోలు మండలం చింతకుంటలో జిల్లా అదనపు ట్రైనీ కలెక్టర్ మనోజ్ పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ భవనం, ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. ఆరోగ్య ఉప కేంద్రంలో మందుల సరఫరా, రోగులకు అందుతున్న వైద్యం తీరుపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో రాజేష్‌కుమార్, ఏంపీవో అశోక్ ఉన్నారు.

2025 నాటికి క్షయ నియంత్రణే లక్ష్యం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో 2025 నాటికి క్షయ నియంత్రణే లక్ష్యంగా వైద్యారోగ్యశాఖ కృషి చేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి గాయత్రీదేవి అన్నారు. గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో క్షయ నివారణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెమడ పరీక్షలు పెంచాలని ఆదేశించారు. టి-హబ్‌లో రక్త పరీక్షల నమూనాలను జిల్లా కేంద్రానికి పంపాలన్నారు. వ్యాధులను అరికట్టడంలో ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు చేయడం కీలకమన్నారు. సమావేశంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యురాలు మాధవి, జిల్లా మలేరియా నివారణ అధికారి ప్రవీణ్‌కుమార్, జిల్లా క్షయ నివారణ అధికారి అరుణ, జిల్లా సర్వేలెన్స్ అధికారి రజిని పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి అవసరం: ఎమ్మెల్యే

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి అవసరమని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జుజాల్‌పూర్ శివారులో ఈ-తక్షిల పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి 43వ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్ర ఎస్జీఎఫ్ కార్యదర్శి రమేష్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి ఐలయ్య, పాఠశాల కరస్పాండెంట్ శరత్, జిల్లా పీఈటీల అసోసియేషన్ కార్యదర్శి మారుతి, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు గణేష్, శంకర్ ముదిరాజ్ తదితరులున్నారు. ఖేడ్ క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఆటో బోల్తా పలువురికి గాయాలు

నారాయణఖేడ్, మానూరు: ఆటో బోల్తాపడిన పలువురి గాయాలైన ఘటన నాగల్‌గిద్ద మండలం సక్రునాయక్‌తండా వద్ద గురువారం జరిగింది. ఖేడ్ మండలం అబ్బెందకు చెందిన వ్యవసాయ కూలీలు కర్ణాటక ప్రాంతానికి పనులకు ఆటోలో వెళుతుండగా సక్రునాయక్‌తండా వద్ద కుక్కలు అడ్డు రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 11 మంది కూలీలు గాయాలు కాగా చికిత్స కోసం ఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్, జీఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ మశ్చేందర్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ ఉమ్మడి మెదక్ జిల్లా సభ్యుడు రవీందర్‌నాయక్, ఆత్మకమిటీ మాజీ రాష్ట్ర డైరెక్టరు మారుతి క్షతగాత్రులను పరామర్శించారు.

అక్రమంగా మట్టి తరలించిన వాహనాలకు జరిమానా

కొండాపూర్, న్యూస్‌టుడే: అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలకు రెవెన్యూ అధికారులు గురువారం రూ.20వేలు జరిమానా విధించారు. బుధవారం తేర్పోల్ గ్రామ శివారులో నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న క్రమంలో గ్రామస్థులు అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. రెవెన్యూ అధికారులు, పోలీసుల అదుపులో ఉన్న ప్రోక్లయినర్‌తో పాటు టిప్పర్‌కు జరిమానా విధించి విడుదల చేశారు.

ప్రారంభమైన సార్వత్రిక విద్య పరీక్షలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం పదో తరగతి తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షకు 217 మందికి 169, ఇంటర్మీడియట్ తెలుగుకు 47 మందికి 34 హాజరయ్యారు. మధ్యాహ్నం ఇంటర్ అరబిక్ పరీక్షకు 13 మందికి 10 మంది రాశారు. జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, సార్వత్రిక విద్య ఉమ్మడి జిల్లా సమన్వయకర్త వెంకట స్వామి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

అర్ధ శతాబ్ది సభ జయప్రదం చేయాలి

జహీరాబాద్ అర్బన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అర్ధ శతాబ్ది రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి కోరారు. గురువారం జహీరాబాద్‌లో రాష్ట్ర సభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నెల 24న జరిగే సభలకు విద్యార్థులు, విద్యావంతులు భారీగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సొంత పురపాలిక భవనం సాకారమెప్పుడో?



ఐడీఏ బొల్లారం సామాజిక భవనంలో..

న్యూస్‌టుడే, జిన్నారం: పురపాలిక కార్యాలయం అంటే వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో పాటు పెద్ద వ్యవస్థ ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజల సందర్శనతో నిత్యం కళకళలాడుతుంది. రాష్ట్రంలోనే పరిశ్రమలు అధికంగా ఉన్న పురపాలికగా పేరున్న ఐడీఏ బొల్లారంలో మాత్రం సుమారు నాలుగు సంవత్సరాలుగా ఇబ్బంది నెలకొంది. పాత భవనం శిథిలం కావడంతో ప్రస్తుతం కార్యాలయాన్ని కేబీఆర్ కాలనీలోని సామాజిక భవనానికి తరలించారు. అక్కడ రెండు అంతస్తులో ఉన్న భవనం ఏ మాత్రం సరిపోవడం లేదు. ఇరుకు గదుల్లో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రూ.కోట్లలో ఆదాయం ఉన్న ఐడీఏ బొల్లారంలో మున్సిపల్ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణ ప్రక్రియలో అడుగు ముందుకు పడడం లేదు.

అనేక విభాగాలు: పురపాలిక కార్యాలయంలో అనేక రకాల విభాగాలు ఉంటాయి. ప్రధానంగా పురపాలిక ఛైర్మన్ ఛాంబర్, సమావేశ మందిరం, కమిషనర్ ఛాంబర్, మేనేజర్, ఆర్వో, ఏఈ, పట్టణ ప్రణాళిక, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పర్యావరణ ఇంజినీర్, అకౌంట్స్ అధికారి కాకుండా 20 వరకు వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇతర సిబ్బంది ఉంటారు. సుమారు 150 మంది వరకు విధులు నిర్వహిస్తారు. వీరందరికి ప్రస్తుతం గదులు లేవు. దీంతో ఒకరు వస్తే ఇంకొకరు రాని దయనీయమైన పరిస్థితి నెలకొంది. గతంలో భవన నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయి. ఇదిగో పనులు అదిగో అందుబాటులోకి అన్నట్లు ఊరించారు. చివరకు సమస్య ఎవరూ పట్టించుకోక గాలికొదిలేసినట్లు కనిపిస్తుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇదే సమయంలో స్థలం ఎక్కడా స్పష్టత లేదు. పాత పంచాయతీ భవనం వద్ద అని కొందరు, ఇక్కడ సరిపోదని అగ్నిమాపక కేంద్రానికి కేటాయించిన స్థలం అని మరికొందరు అంటున్నారు. ప్రజానాయకుల మధ్య స్పష్టత లేకపోవడం కూడా భవన నిర్మాణానికి ఆలస్యమౌతుందనే విమర్శలు వస్తున్నాయి. అంతేకాక వచ్చిన నిధులు సైతం వెనక్కి వెళ్లినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

ప్రత్యేక నిధులు రద్దయ్యాయి: కిష్టయ్య, పురపాలిక ఏఈ, ఐడీఏ బొల్లారం

ఐడీఏ బొల్లారంలో పురపాలిక కార్యాలయానికి నూతన భవనానికి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కాని గతంలో మంజూరు అయిన ప్రత్యేక అభివృద్ధి నిధులు రద్దు అయ్యాయి. అంతే కాకుండా స్థలం విషయంలోనూ సరైన స్పష్టత లేకుండాపోయింది. ఇవన్నీ కొలిక్కి వస్తే భవన నిర్మాణ సమస్య తీరుతుంది.

పీఆర్టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక



మాణయ్య



ప్రభు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: పీఆర్టీయూ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు పోతిరెడ్డిపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పరిశీలకులుగా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్ వ్యవహరించారు. మొత్తం 176 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష ఎన్నికల్లో మాణయ్యకు 115, మదన్ గోపాల్‌కు 61 ఓట్లు వచ్చాయి. 54 ఓట్ల మెజార్టీతో మాణయ్య విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ పడిన ప్రభుకు 118, విఠల్‌రెడ్డికి 58 ఓట్లు వచ్చాయి. 60 ఓట్లతో ప్రభు గెలుపొందారు. కోశాధికారిగా తులసీరాం రాథోడ్‌కు విజయం దక్కింది. మాణయ్య ప్యానెల్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

నీటిశుద్ధి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న నిర్మలారెడ్డి

కంది, న్యూస్‌టుడే: నీటిశుద్ధి తయారీ ప్లాంట్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోందని టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. జె.కె. పెన్నార్ ఫౌండేషన్ సహకారంతో మండలంలోని చిద్రుప్పలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జూలకంటి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘుగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోతిలాల్, శ్రీశైలం తదితరులున్నారు.

అమ్మ దర్శనం..భక్తుల తన్మయత్వం



ఐడీఏ బొల్లారం భవాని శంకరసాయి ఆలయంలో..




సదాశివపేట: అమ్మవారిని దర్శించుకున్న పురాధ్యక్షురాలు అపర్ణా పాటిల్



సదాశివపేట: వాసవి ఆలయంలో..

దసరా నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం బాలా త్రిపుర సుందరిదేవీగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగల్‌పేట దుర్గాభవానీ మాత ఆలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు, కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్‌తోపాటు భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. ఝరాసంగం కేతకి సంగమేశ్వరస్వామి ఆలయంలో మంగళగౌరిదేవిగా దర్శనమిచ్చారు. బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం, ఐడీఏ బొల్లారంలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన మహిళలు కలశాలు ఊరేగింపు నిర్వహించారు. జిన్నారం, రాయికోడ్, మనూరు, సంగారెడ్డి మండలాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. **- న్యూస్‌టుడే బృందం**



ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు



బొంతపల్లిలో..



కేతకిలో మంగళగౌరి అవతారంలో..



రాయికోడ్ ముమ్మాదేవి ఆలయంలో..

బాయిలర్‌లో నీరు మీద పడి ఇద్దరికి గాయాలు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: ప్రైవేట్ పరిశ్రమలో బాయిలర్ తెరుస్తుండగా వేడి నీరు శరీరంపై పడి ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన శంకర్, కృష్ణంరాజు పాశమైలారం పారిశ్రామికవాడ సింథోకెమ్ ల్యాబ్స్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. గురువారం తెల్లవారుజాము రెండు గంటల సమయంలో బాయిలర్ తలుపు తెరిచిన సమయంలో వేడి నీరు శంకర్, కృష్ణంరాజుపై పడ్డాయి. తల కింది భాగం నుంచి కాళ్ల వరకు వేడి నీటితో కాలి గాయాలయ్యాయి. వారిని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీవో అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. శంకర్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కళాశాలలో..



జహీరాబాద్‌లో..

బతుకమ్మ సంబురాలు

జోగిపేట, జహీరాబాద్, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబురాల్లో భాగంగా గురువారం చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. జహీరాబాద్‌లో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు స్థానికంగా ఓ వేడుక మందిరంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

జహీరాబాద్, న్యూస్‌టుడే: జహీరాబాద్ పట్టణంలో ఎరువుల దుకాణాలను గురువారం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. స్థానిక ఏవో లావణ్య ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో భాగంగా విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను పరిశీలించారు. గడువు ముగిసిన, గుర్తింపులేని కంపెనీలకు చెందినవి అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంత్రిని అవమానించిన వారిపై కేసు నమోదు చేయాలి

ఐడీఏ బొల్లారం, (జిన్నారం)ఝరాసంగం, న్యూస్‌టుడే: మంత్రి కొండా సురేఖపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు పెట్టిన వారిని గుర్తించి కేసు నమోదు చేయాలని ఐడీఏ బొల్లారం కాంగ్రెస్ నేతలు గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పి.జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాలమ్మ ఉన్నారు. ఎఫ్ఐఆర్ చేయలేదని పోలీసులు తెలిపారు.

ఆవాసాలపై వానరాల దండయాత్ర



ఖేడ్ జూనియర్ కళాశాల భవనంపై కోతులు

న్యూస్‌టుడే, నారాయణఖేడ్: ఈ ఏడాది వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో అడవుల్లో ఆహారం, నీరు లేక అటవీ జంతువులు గ్రామాలు, పల్లె శివారుల్లో సంచరించాయి. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసి అటవీ ప్రాంతాలు, గ్రామ శివారు, పొలాలు, చెట్లతో కళకళలాడుతున్నా వేసవిలో తిష్ట వేసిన వానరాలు మాత్రం గ్రామాన్ని వదలడం లేదు. ఈ దుస్థితి ఖేడ్ ప్రాంతంలో ఎనిమిది నెలలుగా కోతుల సంచారం మరింత అధికమైంది. జనాలపై దాడులు చేస్తుండటంతో పాటు ఇళ్లలోని ఆహార పదార్థాలు ఎత్తుకెళుతున్నాయి. కొన్నిచోట్ల ఇళ్ల పెంకులపై కోతులు దూకుతుండడంతో పెంకులు పగిలి ధ్వంసమవుతున్నాయి. ఇక గ్రామాల్లో పంటలకు నష్టం చేకూర్చడంతో కోతులతో గ్రామస్థులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.

- నారాయణఖేడ్‌లో దాదాపు 500 కోతులు ఉన్నాయి. ఇళ్లపై గెంతుతూ కాలనీల్లోని చెట్లపై సేదతీరుతున్నాయి. వీటిని దూరంగా తరలించేందుకు ప్రయత్నించిన వారిపై దాడులు చేస్తున్నాయి. పలు కోతులు వాటి పిల్లలతో సంచరిస్తూ వాటిని కాపాడుకునే క్రమంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల మందను జనాలు వెళ్లగొట్టిన మళ్లీ తిరిగి వస్తున్నాయి. ఖేడ్ పుర పరిధి చాంద్‌ఖాన్‌పల్లిలో వంద వరకు కోతులు సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. గ్రామస్థులు టపాసులు కాల్చి, డప్పుల మోతలు మోగిస్తూ వాటిని భయపెట్టి ఐదారు కిలోమీటర్ల మేర తరుముతున్నారు. తిరిగి మరుసటి రోజే గ్రామంలో ప్రత్యక్షం అవుతున్నాయి.

కనిపించిన వారిపై దాడులు: మూడేళ్ల కిందట కోతులు నెలరోజులపాటు ఖేడ్ పట్టణంతోపాటు సమీపంలో ఉన్న మంగల్‌పేట, జూకల్ గ్రామాల్లో భయాందోళనలు సృష్టించాయి. మహిళలే లక్ష్యంగా కనిపించినవారిపై దాడులకు పాల్పడ్డాయి. నెలలో దాదాపు 50మంది మహిళలు, చిన్నారుల దాడి చేయగా తీవ్రంగా గాయడపడ్డారు. దీంతో అప్పట్లో అధికారులు రూ.30వేలు చెల్లించి కోతులు పట్టేవారిని రప్పించి వారితో వానరాలను పట్టుకుని నర్సాపూర్ అటవీ ప్రాంతంలో వదిలేయడంతో పట్టణవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

శాస్త్రీనగర్‌లో బెడద: ఖేడ్ పట్టణ చివరన శాస్త్రీనగర్ కాలనీ ఉంది. ఇక్కడ దాదాపు యాభై వరకు కోతుల మంద రెండేళ్లుగా సంచరిస్తోంది. కాలనీలో పెంకుటిళ్లు అధికంగా ఉండగా కోతులు వాటిపై గెంతడంతో పెంకులు తరచూ పగిలిపోతున్నాయి. కొత్తవి ఏర్పాటు చేసుకోవడానికి వ్యయ ప్రయాసలు పడుతున్నారు. కాలనీ పక్కనే పంట పొలాల్లో కూరగాయ, ఇతర పంటలపై దాడులు చేస్తూ నష్టానికి గురిచేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. విషయాన్ని అటవీశాఖ వారి దృష్టికి తీసుకెళ్లగా, వాటిని పట్టి అడవుల్లో వదిలేందుకు ప్రత్యేకంగా నిధులంటూ లేవని, తామేమీ చేయలేమని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వానరాల బెడదను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇబ్బందులు తొలగించాలని ఖేడ్ పట్టణంతోపాటు బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట:

? సంగారెడ్డి పట్టణం శివాజీ నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు బయటకు రావాలంటే భయంగా ఉంది. వీధి దీపాలు బాగుచేయించాలి. **- కుమార్, సంగారెడ్డి**

✓ వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయించి, ప్రజలు ఇబ్బందులు తీరేలా చర్యలు తీసుకుంటాం. **- ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ**

? సంగారెడ్డి పట్టణం బ్యాంకు కాలనీలో చెత్త సేకరణ సిబ్బంది సక్రమంగా రావడం లేదు. చెత్త ఎక్కడ వేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నాం. **- రాములు, సంగారెడ్డి**

✓ చెత్త సేకరణ సిబ్బంది నిత్యం ఇళ్లకు వెళ్లి తీసుకెళ్లేలా సూచనలు చేస్తాం. **- సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, సంగారెడ్డి**

? జోగిపేట పట్టణంలోని మల్లన్న ఆలయం పక్కన ఇళ్ల మధ్యలో మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో దోమలు, పందుల బెడద ఎక్కువైంది. దుర్వాసన వస్తోంది. **- మాణయ్య, జోగిపేట.**

✓ ఇళ్ల మధ్య మురుగు నీరు పారకుండ చర్యలు తీసుకుంటాం. అవసరం మేరకు మురుగు కాల్వలు నిర్మిస్తాం. **- తిరుపతి, పుర కమిషనర్ అందోలు-జోగిపేట**

? అందోలు మండలం అన్నాసాగర్ గ్రామ శివారులో పలు చోట్ల విద్యుత్తు స్తంభాలు, నియంత్రికల వద్ద ఎర్తింగ్ తీగలు ప్రమాదకరంగా మారాయి. **- రాజు, అన్నాసాగర్.**

✓ ఎర్తింగ్ తీగలతో ప్రమాదాలు జరగకుండా, వాటి నియంత్రణకు తగు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరిస్తాం. **- శ్రీనివాస్, ఏఈ విద్యుత్తు శాఖ, అందోలు**

ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రచారం కల్పించండి



నీలం మధుకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఐడీఏ బొల్లారం నాయకులు

ఐడీఏ బొల్లారం, (జిన్నారం) న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి నీలం మధు సూచించారు. గురువారం ఐడీఏ బొల్లారం నాయకులు ఆయనను కలిశారు. బొల్లారంలో మా అంబి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే నవరాత్రి వేడుకలకు హాజరు కావాలని కోరారు. కార్మిక నాయకుడు వరప్రసాద్‌రెడ్డి, దీనానాథ్ రాజారామ్, శ్రీమన్నారాయణ తదితరులున్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి ఐకాస జిల్లా గౌరవ అధ్యక్షురాలు అనురాధారెడ్డి, అధ్యక్షురాలు వినీలరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో రెడ్డి ఐకాస మహిళా విభాగం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వాతిరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా స్రవంతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనర్సింహారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నిర్మలారెడ్డి, ఈశ్వరీరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా మమతరెడ్డి, భారతీరెడ్డి, హేమలతారెడ్డి, ఉప కోశాధికారిగా అరుణారెడ్డి ఎన్నికయ్యారు. సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

5న కిసాన్ సంఘ్ మహాసభలు

సంగారెడ్డి గ్రామీణ, న్యూస్‌టుడే: కామారెడ్డిలో ఈ నెల 5న జరిగే భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని నాగాపూర్, కల్పగూర్, కులబ్‌గూర్, ఈర్గిపల్లి గ్రామాల్లో రైతులతో కలిసి గురువారం సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. వీరప్ప, లక్ష్మీకాంత్‌రెడ్డి, మొగులయ్య తదితరులున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల వితరణ

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: అందోల్-జోగిపేట పురపాలిక పారిశుద్ధ్య కార్మికులకు జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నూతన దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ..మున్సిపల్ కార్మికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. పురపాలిక ఛైర్మన్ మల్లయ్య, క్లబ్ జిల్లా కార్యదర్శులు అనంతరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, పద్మనాభరెడ్డి, రాంబాబు, జోగిపేట లైన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి తదితరులున్నారు

న్యాయవాదిపై దాడికి నిరసనగా రాస్తారోకో

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: నాంపల్లి కోర్టు న్యాయవాది ఎండీ అబ్దుల్ కలీమ్‌పై పోలీసుల దాడికి నిరసనగా సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డిలో రాస్తారోకో నిర్వహించారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రాస్తారోకోను నిలిపివేశారు. క్రీడల కార్యదర్శి అశోక్, గ్రంథాలయ కార్యదర్శి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఖాజీపల్లి, (జిన్నారం), న్యూస్‌టుడే: మండలంలోని ఖాజీపల్లిలో ఆర్‌కె ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. అన్ని రకాల పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందించారు. ఫౌండేషన్ ఛైర్మన్ రమాకాంత్ ఉన్నారు.

ఘాటు వాసనలతో ఉక్కిరి బిక్కిరి

జిన్నారం, న్యూస్‌టుడే: మండలంలోని ఖాజీపల్లి పంచాయతీ పరిధి 181-జీఎమ్మార్ కాలనీలో రసాయనాల ఘాటు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి ఘాటైన వాసనలు ఊపిరి పీల్చుకొని ఇవ్వలేదని కాలనీవాసులు తెలిపారు. ఖాజీపల్లి పారిశ్రామికవాడతోపాటు దుండిగల్ శివారులోని ఓ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు నుంచి ఘాటువాసనలు వస్తున్నాయన్నారు. పీసీబీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.

ఆలయ నిర్మాణానికి చేయూత

జిన్నారం: మండల కేంద్రమెం జిన్నారం తాబేలు గుట్టపై నిర్మిస్తున్న శివాలయానికి రూ.6లక్షలు విలువ చేసే కాంక్రీటు ఇచ్చేందుకు ఐడీఏ బొల్లారం పురపాలిక ఉపాధ్యక్షుడు అనీల్‌రెడ్డి అంగీకరించాడు. గురువారం ఆలయాన్ని ఆయన సందర్శించగా కమిటీ సభ్యులు సత్కరించారు.

దరఖాస్తు చేసుకుంటే పరిహారం



రైతులతో మాట్లాడుతున్న శ్రీధర్‌రావు

మనూరు, న్యూస్‌టుడే: అడవి పందులు, జింకలతో పంటల నష్టం జరిగితే వెంటనే దరఖాస్తు చేసుకుంటే పరిహారం వస్తుందని జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు అన్నారు. 'రైతన్నలకు అన్నీ కష్టాలే' గురువారం ఈనాడులో కథనం ప్రచురితం కావడంతో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు స్పందించారు. మనూరు మండలం రాణాపూర్, గట్‌లింగంపల్లి గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి మహేష్ చౌహాన్, అటవీశాఖ, వ్యవసాయాధికారులు రైతులు ఉన్నారు.

రాజకీయ కక్షతో ఆరోపణలు

ఝరాసంగం, న్యూస్‌టుడే: తనపై రాజకీయ కక్షతో ప్రజలను ఉసిగొల్పి తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఝరాసంగం మాజీ ఎంపీపీ దేవదాస్ సూచించారు. గురువారం బిడకన్నెలో ఆయన మాట్లాడారు. శిఖం భూమిలో తాను ఇల్లు నిర్మించుకున్నట్లు భారాస నాయకులు గ్రామస్థులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. తప్పుని నిరూపిస్తే విచారణకు సిద్ధమన్నారు.